RNI APTEL / 2006 / 17980

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

₹ : 5

CHRISTAVANAADU

TELUGU FORTNIGHTLY REGD. NEWS PAPER
PUBLISHED FROM VISAKHAPATNAM

ఎడిటర్ : వై.కనకరాజు

Br Y Kanaka Raju : 7981542666 / 9346960601
Br Y L Raviraju : 9985656511 | Br Y Dhana Raju : 9866113513

CHRISTAVANAADU
Post Box No. : 2
AdarshNagar(Po)
Visakhapatnam - 530 040

Website : christavanaadu.weebly.com
christavanaadu@gmail.com | christavanadu@gmail.com
christavanaadu1@yahoo.co.in
facebook: christavanaadu

దేవుని వాక్యమే సత్యము.. సకలాశీర్వాదాలకు కారణం. ఆ వాక్యమే ‘క్రైస్తవనాడు’ కు ఆయుధం. అందుకు దేవునికి స్తోత్రము.

సంపుటి : 12 సంచిక : 21 2018 జూన్ 16-30 పేజీలు : 8

సత్యవాక్య పోరాటంలో... 12వ, సంవత్సరం.



ఒకరు దేనివల్ల చిరస్థాయి పేరు పొందగలరంటే.. కేవలం మాటచేతే

- డా.చాగంటి కోటేశ్వరరావు



మందపై అధికారులుగా గాక వారికి మాదిరిగా ఉండాలనుకున్నవారే క్రీస్తు ఆత్మ కలిగినవారు

- బిషప్ ఎం.ఎ.పాల్
విశాఖపట్నం



నిజాయితీపరుడ్ని నడిపించేది ధనం కాదు.. జనం

- బాలకృష్ణ
‘శ్రీమన్నారాయణ’ చిత్రంలో




(గత సంచిక తరువాయి) దేవుని గుణగణాలను మానవ శరీరంలో నెరవేర్చి చూపుట బహుకష్టం. దేవుడు అన్నిచోట్ల ఏకకాలంలో ఉండ సమర్థుడు. అందువల్లే ఆధ్యాత్మికులు దేవుని సర్వాంతర్యామి అంటారు. మనిషి ఒక్కచోటనే ఉండగలడు. అటువంటి శరీరాన్ని ధరించిన యేసుక్రీస్తు దేవుని ఉన్నతత్వాన్ని ఆ శరీరంలో తన బ్రతుకులో చూపించారు. ఇది అమోఘమైన సంగతి. ఆ విధాన అప్పటి ప్రజలను ఆశ్చర్య చకితులను చేసారు. అది ఇప్పటివారికీ ఆశ్చర్యమే! ఇది ఎవరూ కాదనలేని ఆధ్యాత్మిక, సామాజిక సత్యం. భూమిపై జీవించునపుడు ఆయన దేవునియందు ఎంత భయభక్తులు కలిగియున్నారో తెలుసు కొనుటకు ఆయన మరణాన్ని జయించిలేచిన తరువాత వ్రాయబడిన మరొక లేఖనంచూస్తే... 2లో

## ...ప్రభుత్వ పోకడపై ఆలీవర్ ధ్వజం!

● నెరవేరని ప్రభుత్వ వాగ్దానాలు!! ● క్రైస్తవ సమాజంలో తీవ్ర అసంతృప్తి
● రాష్ట్రస్థాయి నాయకుల సమావేశం ● కీలక నిర్ణయాలు





**భీమిలి, గ్రేటర్ విశాఖ :** ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ లీడర్స్ ఫోరం (ఎపిసిఎల్ఎఫ్) అధ్యక్షులు ఆలీవర్ రాయి తమ క్యాంపస్‌లో రాష్ట్రస్థాయి క్రైస్తవ నాయకులు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసారు. అన్ని జిల్లాల నుంచి నాయకులు పాల్గొన్న ఈ సమావేశంలో ప్రభుత్వ ధోరణిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తపరచారు. క్రైస్తవుల యెడల చూపుతున్న వివక్షపై నిప్పులు చెరిగారు.

క్రైస్తవులకిచ్చిన హామీలన్నీ తుంగలోకి తొక్కే విధానం చూస్తుంటే ప్రభుత్వ ధోరణి తమ యెడల ఎలా ఉందో స్పష్టమౌతుందన్నారు. బరియల్ గ్రౌండ్స్‌కి స్థలాల్వేవు.. ఇస్తానంటారు.. ఇవ్వరు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వచ్చే ఎన్నికల్లోలోగా మ్యానిఫెస్టోగా పెడతామంటున్నారు. అదెంతవరకు సమంజసం? ఇప్పుడు ప్రభుత్వం మీదేగా! చెయ్యాల్సిందిప్పుడు చేయకుండా వచ్చే ఎన్నికల తర్వాత చేస్తామనడం హాస్యాస్పదం. ఓ రకంగా చెవిలో పువ్వులెట్టడమే!

నాలుగేళ్లు గడిచినా ప్రభుత్వంలో ‘మైనారిటీ మంత్రిగా’ క్రైస్తవుల్ని నియమించలేదెందుకు? మైనార్టీ కార్పొరేషన్ ముఖ్య పదవుల్లో ఇద్దరు ముస్లిం వర్గంవారే! క్రైస్తవ నాయకులెందుకు లేరని తీవ్రంగా ప్రశ్నించారు ఆలీవర్ రాయి.

తెలంగాణలో ఎం.ఎల్.సి. ఉన్నప్పుడు, ఆంధ్రలో ఎమ్మెల్సీగా క్రైస్తవ సమాజంలో ఎవర్నైనా ఎందుకు నియమించలేదు? ఇంకెప్పుడు నియమిస్తారని ఎద్దేవాచేసారు ఆలీవర్

పదమూడు జిల్లాల్లోనున్న సమస్యలను అతి దగ్గరగా చూసిన వానిగా ప్రశ్నిస్తున్నా మా సమస్యలు తీరేదెప్పుడన్నారు. అందుకే మనం ప్రభుత్వాన్ని కదిలించేట్లు కలసికట్టుగా మన హక్కులను రాబట్టుకోవాల్సిందే! అందుకోసం మనమంతా పోరాడేందుకు సమయం ఆసన్నమైంది.

సమస్యల పరిష్కారాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపుతారో లేదో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. అలాగే ప్రతిపక్ష నాయకుడు వైయస్ జగన్‌ను కలసి వినతి పత్రం అందిద్దాం అన్నారు ఎ.పి.సి.ఎల్.ఎఫ్. అధ్యక్షులు ఆలీవర్ రాయి. దానికి ఏకగ్రీవ ఆమోదం తెలిపారు 13 జిల్లాలనుంచి వచ్చిన క్రైస్తవ నాయకులు, సేవకులు. ఏం జరగనుందో వేచిచూడాల్సిందేనన్న ఆసక్తిప్పుడు క్రైస్తవ సమాజంలో నెలకొంది.

ఏదేమైనా క్రైస్తవుల హక్కులకై పోరాడే.. నాయకునిగా ముందుకొచ్చిన ఆలీవర్ రాయి – రాష్ట్రస్థాయిలో తన ప్రభావాన్ని చూపుతున్నారని చెప్పక తప్పదన్నది క్రైస్తవుల మధ్య జరుగుతున్న చర్చ. సేవకులు, నాయకులు ఆలీవర్ రాయికి మరింత సహకరించాలని 13 జిల్లాల్లోనున్న పలువురు కోరుతున్నారు.

## ప్రదీప్... నిన్నెలా మరువగలం?!



D.O.B 9-10-1977
D.O.D 17-06-2018

చిన్నవయసులోనే లోకాన్ని వీడిన బ్రదర్ ప్రదీప్ విశాఖలోనున్న ఆంధ్ర బాప్టిస్ట్ సంఘ జాయింట్ ట్రెజరర్‌గా సేవలందించారు. ఆ యా వివరాలు ‘సెంటర్ స్ప్రెడ్’ లో..



ఆంధ్ర బాప్టిస్ట్ సంఘం (విశాఖ) ఛైర్మన్ బిషప్ కె.సుందర్ సింగ్, అశోకా సింగ్ దంపతులు

## యూనివర్సిటి ఆఫ్ జెరుసలేమ్

(యెరుషలేము విశ్వవిద్యాలయము)

యూనివర్సిటి ఆఫ్ జెరు సలేమ్, భారతదేశంలో మరియు ఇతర దేశములలో ధియోలాజికల్ విద్యారంగంలో ప్రఖ్యాతిగాంచిన కేంద్రంగా ఆమోదించబడినది.

దూర విద్య



డా॥ ప్రొ॥ వి. అల్బర్ట్ జయసింగ్
ఎమ్.ఏ., ఎమ్.బి.ఏ., ఎల్.ఎల్.డి. పి.హెచ్.డి. డి.సి.ఎల్., ఎఫ్.ఆర్.సి.ఎస్.
ఛాన్సలర్



- దూరవిద్య ద్వారా పాఠ్యంశములు మరియు పరీక్షలు నిర్వహించబడును.
- విశ్వవిద్యలయానికి హజరు కాకుండ ఇంటి వద్దనే కోర్సును పూర్తి చేయవచ్చును.
- దైవ జనులు, దైవ సేవకులు మరియు క్రైస్తవ సహోదరి, సహోదరలు అందరూ ఈ కోర్సులు చేయటానికి అర్హులు.
- ఎటువంటి సంఘ విబేదములు లేకుండా క్రైస్తవులందరూ అర్హులు.
- ప్రత్యేకంగా తెలుగు భాషలో కోర్సులు అందుబాటులో కలవు.
- కోర్సులకు అనుగుణమైన పాఠ్యంశములు అందించబడును
- కోర్సులలో ప్రవేశం కొరకై సంవత్సరంలో ఎప్పుడైన సంప్రదించవచ్చును.

• **అందించబడు కోర్సులు:**
సి.టిహెచ్., డి.టిహెచ్., (C.Th., D.Th.,)

• **మాస్టర్స్ :**
ఎమ్.టిహెచ్., ఎమ్.డివినిటి., ఎమ్.మిన్.,
(M.Th., M.Div., M.Min.,)
ఎమ్.బి.ఏ. (క్రిస్టియన్ బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్)
(MBA (Christian Business Adiministration)
ఎమ్.ఏ. (క్రిస్టియన్ కౌన్సలింగ్)
(M.A.(Christian Counseling)
పి.జి.డిప్లొమ ఇన్ క్రిస్టియన్ కౌన్సలింగ్.
(PG Diploma in Christian Counseling).

• **బ్యాచలర్స్ :**
బి.టిహెచ్., బి.డి., డి.మిన్., (B.Th., B.D., B.Min.)
బి.బి.ఏ. (క్రిస్టియన్ బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్)
(BBA (Christian Business Adiministration)

• **డాక్టరల్ ప్రొగ్రామ్స్:**
డి.మిన్., డి.డి., డి.టి.హెచ్., ఎస్.టి.డి., (D.Min., D.D., D.Th., S.T.D.,)
పి.హెచ్.డి. ఇన్ బిబ్లికల్ స్టడీస్ (Ph.D. in Biblical Studies)
పి.హెచ్.డి. ఇన్ క్రిస్టియన్ కౌన్సిలింగ్ (Ph.D. in Christian Counseling)
పి.హెచ్.డి. ఇన్ క్రిస్టియన్ లీడర్‌షిప్ (Ph.D. in Christian Leadership)
పి.హెచ్.డి. ఇన్ చర్చ్ మేనేజ్‌మెంట్ (Ph.D. in Church Management)

అప్లికేషన్ ఫారం మరియు బ్రోచర్ పొందుటకు పోస్ట్ / మెయిల్ / ఎస్.ఎమ్.ఎస్ ద్వారా మీ పూర్తి అడ్రస్సు వివరముగా తెలిపి, మీరు ఏ బాషలో కోర్సుని చేయదలచినారో ఆ బాషను ఎంచుకొని మాకు పంపగలరు.
(ఇంగ్లీషు/తమిళ్/హిందీ/మలయాళం/తెలుగు)

యూనివర్సిటి ఆఫ్ జెరుసలేమ్
పోస్ట్ బాక్స్ నెం.26,
నెం.2, వాణిలైయరాసు స్ట్రీట్,
(ఫిలిప్స్ హాస్పిటల్ వెనుక)
తాంబరం వెస్ట్, చెన్నై,
తమిళనాడు - 600 045

ఫోన్ : +91-44-4218 5566
మొబైల్ : +91 90 94 94 94 91

ఇ-మెయిల్: info@ujglobal.org
వెబ్‌సైట్ : www.ujglobal.org

www.facebook.com/ujglobal
www.youtube.com/ujglobal
0 9094949491
0 9094949491



రెవ.డా.జాయ్ చెరియన్ గారు రచించిన ‘1000 దేవుని వాగ్దానములు’ పుస్తకంలోని అంశాలు 7వ, పేజీలో

విశాఖలో వివాదాలు - ప్రశ్నలు లేవనెత్తిన సేవకుల - క్రైస్తవుల సమైక్య మహోత్సవము 8 లో

డా.పి.సతీష్ కుమార్‌కు రాజకీయ ఎజెండాలేదు : బిషప్ కె.ఆర్.సింగ్








డా.పి.సతీష్ కుమార్ (హైద్రాబాద్), బిషప్ కె.ఆర్.సింగ్, బ్రదర్ శామ్యూల్ కర్మోజి (విశాఖ)

**శరీరధారియై యున్న దినములలో మహా రోదనముతోను, కన్నీళ్లతోను తన్ను మరణము నుండి రక్షింపగలవానికి(దేవునికి) ప్రార్థన లను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన(యేసుక్రీస్తు) అంగీకరిం పబడెను.★**

పై వాక్యాన్ని చదివారు, ఆలోచించండి! మనుష్యులు దేవుని యందు భయభక్తులు కలిగి ఉంటున్నారా? మనకై మనం అలాంటి సాక్ష్యం కలిగి జీవించగలుగుతున్నామా? ఇంతవరకూ లోకంలో ఘనులెవరైనా అలాంటి జీవిత సాక్ష్యం కలిగి ఉన్నారా అని వెతికితే చరిత్రలో ఎవరూ లేరన్నది సత్యదూరం కాదు. చరిత్రలో ఘనులైన అందరూ రక్తసిక్త జీవితాలతో సంబంధాలు కలిగినవారే. యేసులాంటి జీవన విధానం కొంతవరకు కలిగిన వ్యక్తిగా మన దేశానికి చెందిన గాంధీజీ అని చెప్పొచ్చు. మన దేశానికి దేవుడిచ్చిన బహుమానమే గాంధీ జీవితం. ప్రభువైన యేసుక్రీస్తుకు సాదృశ్యం. అయినాసరే గాంధీజీ జీవనవిధానాన్ని యేసుక్రీస్తు జీవనవిధానంతో సరిపోల్చలేం. గాంధీజీయే కాదుగాని అలా ఎవరూ జీవించలేరన్నది అతిశయోక్తికాదు. యేసు పలికిన ఓ మాట గాంధీజీ పలికిన మాటగా మనదేశంలో బహుళ ప్రాచుర్యం పొందింది. అదేదనగా 'ఎవరైనా నీ కుడి చెంపపై కొడితే ఎడమ చెంప చూపమన్నది'. ఇది గాంధీ చెప్పినట్లు మనదేశంలో అనేకులు భావిస్తారు. నిజానికి ఆ మాట ప్రభువైన యేసుక్రీస్తు పలికినదని మరోసారి గుర్తుచేస్తున్నా! అటువంటి అనేక మాటలు అనగా దేవుని ప్రేమతత్వాన్ని తెలిపేవి తన బ్రతుకుకాలంలో చూపి లోకానికి యేసుక్రీస్తు మార్గదర్శకులైనారు. శరీర కోరికలను బట్టి జీవించు వారు దైవతత్వమైన ఆత్మతత్వాన్ని అర్థంచేసు కొనుట బహుకష్టం. గ్రహించు వారందరూ ఆచరిస్తే ఈ లోకమే పరలోకం అయ్యేది. అలా బ్రతుకుటకు అనేకులు ఇష్టపడక తమ శరీరాశలు, నేత్రాశలు, జీవపు డంబాలు, నెరవేర్చు కొనుటచే ఈ లోకం అశాంతికి గురౌ తుందనుటకు సందేహ పడనక్కరలేదు.




**ఆత్మానుసారముగా నడుచుకొనుడి. అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. ★**

ఆత్మయే జీవింప జేస్తుందని, ఆత్మలేకపోతే శరీరం మృతమని, అదే మరణమని ఆస్తికుల నమ్మకం. ఆత్మానుసారముగా జీవించువారు ఎలా ఉండాలో తెలియజేస్తూ వ్రాయబడిన వాక్యం పరిశుద్ధ గ్రంథం నుండి.... మనం ఆత్మను అనుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందుము. ఒకరినొకరము వివాదము రేపకను, ఒకరి యందొకరము అసూయ పడకను వృథాగా అతిశయ పడకను ఉందము.

పై మాటలలో గల సత్యం గ్రహించి ఆచరిస్తే మానవులు అందరూ మహనీయులే అయ్యేవారు. యేసుక్రీస్తు తన బ్రతుకుకాలంలో పై వాక్య భావాన్ని సంపూర్ణంగా తన శరీరమందు నెరవేర్చినట్లు పరిశుద్ధ గ్రంథం చదివి గ్రహించువారికి సులువుగా తెలుస్తుంది. అందు కారణంచే ఆయన 'పూజార్హుడు'. ఆయనతో ఎవరు సమానులు కాగలరు? ఎవరిని మనం సమానులనుగా చేయగలం? ఆలోచించండి! అన్ని నామాలకంటే పైనామం ఆయనకియ్యబడిందని పరిశుద్ధ గ్రంథంలో మనమనేకసార్లు చదువుతాం.. వింటుంటాము.. ఒప్పుకుంటాము. మరి అలా ఒప్పుకున్న క్రైస్తవులే మనలో అనేకులను ఆయనతో సమానం చేయుట చూడగలుగుతున్నాం. వారినే పూజిస్తూ (అనేకసార్లు తలవడము, వారు మాత్రమే వీరి అవసరాలు తీర్చగలరని వారిని ఘనపరచడం, వారిని గూర్చే రోజులో ఎక్కువసార్లు పలుకడము ఇటువంటివెన్నో పూజించుట క్రిందకు వస్తాయి) ప్రభువైన యేసుక్రీస్తుతో సమానులునుగా వారికి తెలియకుండానే చేస్తున్నారు. అవునో కాదో మీరే చెప్పండి!

క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను, దురాశలతోను సిలువవేసి యున్నారు. పై వాక్యం నెరవేర్చుటకు ఇష్టపడుచు ఆమాట వ్రాసిన అపొస్తలుడైన పౌలువలే తమ శరీరాలను నలగగొట్టుకుంటూ జీవిస్తే చాలు. మనల్ని బట్టి ఆయన నామం ఘనపరచబడుతుంది. అలాంటి వారు ఆయనను ప్రకటిస్తూ (క్రీస్తుని నమ్మని వారికి, క్రైస్తవులకుకాదు). బయలు వెళ్ళితే ప్రపంచమంతా ఆయన నామం పూజింపబడుతుంది. 'పూజార్హుడు' ఆయన మాత్రమే అని తలంచువారు ఆయనను ప్రకటింపబద్దులై యున్నారు. ఆయన క్రైస్తవులమైన మనకు చెయ్యమన్న 'పని' ఇదొక్కటే. ఆ పనిని మన బ్రతుకుకాలంలో సక్రమంగానెరవేర్చి ప్రభువిచ్చు 'జీతం' పొందిన వారిగా ఉండాలి. మన తరువాతి తరాలలో గుర్తింపబడుటకు ఇష్టపడాలి. మన హృదయాలలో పూర్తిగా నిండి ఉండవలసిన వారు యేసుక్రీస్తు మాత్రమే. వేరెవ్వరూ కారారు. ఆయన చేసిన కార్యం మరెవ్వరూ చేయలేనిది. ఆయన మన పాపములకు మాత్రమే కాదు సర్వలోకమునకు శాంతికరమై యున్నాడు అని పరిశుద్ధ గ్రంథం ఘంటాపథంగా చెబుతుంది. అందువలన ఆయన మాత్రమే 'పూజార్హుడు'.ఇది మన మరణాంతరం గుర్తుంచుకొని ప్రకటించాల్సిన అపూర్వమైన సంగతి. అట్టి వారికి మాత్రమే వర్తించే పరిశుద్ధ గ్రంథంలోగల మరోమాట ... యేసురక్తం ప్రతిపాపములనుండి మనలను పవిత్రులునుగా చేయును. ఆయన రక్తం వలన పవిత్రులమవుతున్న మనలో ఎవరూ ఆయనతో సమానులంకామన్నది మరోసారి చెబుతున్నా. ఇంత చెప్పినా మా బోధకుల్నే, మా నాయకుల్నే యేసుకంటే ఎక్కువగా తలచుకొంటామని ఎవరైనా అనుకుంటే అదివారి అవిధేయతే కాగలదు. అలా తలచుట ఎంతో ఆశ్చర్యం, మరెంతో బాధాకరం. క్రైస్తవులు ఆయనను ప్రకటిస్తూ జీవితాలను భూమిపై ముగించి ఆయన సన్నిధికి చేరుటకే పిలువబడ్డారు. ఆయన మనల్ని పిలిచిన పిలుపును గుర్తించి, గౌరవించి నెరవేరుద్దాం. ఆ 'పూజార్హున్ని' అందరిచే పూజించేవారిగా మలుద్దాం. ఆయన మానవాళికై చేసిన కార్యాలు ప్రకటిద్దాం! అట్లు వీలుకానివారు ప్రకటించు అనేకులకు సహకరిస్తారని నమ్ముతున్నాము. యేసుక్రీస్తు జనన, మరణ, పునరుత్థానాలే సువార్త. ఆ సువార్తను ప్రకటిస్తూ మనవలే అందరూ వారి మరణాంతరం ఆయన సన్నిధికి చేరేట్లు చేయాలి. నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించుమన్న ప్రభువు ఆజ్ఞనునెరవేర్చుటంటే అదే. క్రైస్తవలక్ష్యమదే. యేసుక్రీస్తును నమ్ముట కులం, జాతి, మతం(దేవునికివేవీలేవు) మారుట కాదు. వారి మనసు మారుటేనన్నది బలంగా ప్రకటించాలి.

**క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమ పరుస్తున్నప్పుడు ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచే చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. మరిన్ని రాసేట్లు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తు చేసుకోగలరని కోరుతున్నాం.-ఎడిటర్.**

# ప్రకటన గ్రంథము 8



**'ప్రకటన గ్రంథం' పై వివరణలు ఇప్పటివరకు మీరు రకరకాలుగా వినుంటారు! అందుకు సంబంధించి ఓ వివరణ సీనియర్ పాస్టర్ ఎ.యం.అబ్రహాంగారి కలం నుంచి 'క్రైస్తవనాడు'కు ప్రత్యేకం!**

తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లాలో నివాసముంటున్న **పాస్టర్ ఎ.యం.అబ్రహాము** గారు ఏడు పదుల వయసులోనూ నిత్యం పరిశుద్ధగ్రంథాన్ని ధ్యానిస్తూ.. రచనలు చేస్తూనే ఉంటారు. సత్యాన్ని ఉన్నదున్నట్లు సమాజానికి అందించాలన్న ఆశయాన్ని పుష్కలంగా కలిగిన సీనియర్ పాస్టర్ రెవ.అబ్రహాము గారు అనుట అతిశయోక్తికాదు. వీరెంతో అనుభవజ్ఞులు.. నిగర్వి. అది వారింటికి వెళ్లేవాళ్లకి స్పష్టంగా కనబడుతుంది. వారి ఇతర రచనలు కూడా దీని తరువాత పాఠకులు చదువగలరు – **ఎడిటర్.**

3.3. నందు ప్రభువు దొంగవలె వచ్చెదను అని చెప్పుచున్నాడు. ఈ మాటలు ప్రభువు యొక్క రెండవ రాకడను సూచించుట లేదు కాని అకస్మాత్తుగా సంఘము మారుమనస్సు పొందని యెడల దేవుడు తీర్పు తీర్చనైయున్నాడని తెలియచేయుచున్నది. ఇతర వేద భాగములలో యేసుక్రీస్తు దొంగ వలె వచ్చునని వ్రాయబడిన భాగములు అని యేసుక్రీస్తు యొక్క రెండవ రాకడను సూచించును (2పేతురు 3:10, ప్రక 16:15). యేసు క్రీస్తు సంఘమును పరమునకు కొనిపోవుటకు మధ్యాకాశమునకు వచ్చు రాకడ కూడ దొంగ వచ్చునట్లుగా ఉండునని యేసు తానే చెప్పియున్నాడు (మత్తయి 24: 42–44).

3.5. నందు జయించువాడు తెల్లని వస్త్రములు ధరించుకొనును అని ప్రభువు చెప్పుచున్నాడు. ఇట్టి వాగ్దానము ఇతర భాగములలో కూడ చదువగలము (3:18, 4:4, 6:11, 7:9, 7:13, 15:6, 19:14). ఈ వాక్య భాగములలో వారు వాస్తవముగా తెల్లని వస్త్రములు ధరించుకొనుచున్నారు. ఈ తెల్లని వస్త్రములు నీతి క్రియలను సూచించుచున్నవి (19:8). జీవగ్రంథము నుండి అతని పేరు ఎంత మాత్రము తుడుపు పెట్టబడదు అను వాగ్దానము 3:3 నందును షరతునకు లోబడు వారికి మాత్రమే. అనగా దేవుని షరతులకు లోబడక ఉన్న యెడల వారి పేర్లు తుడిపి వేయబడునని దీని ద్వార గ్రహించగలము. పాపము చేయువాని పేరు దేవుని గ్రంథము నుండి తుడిపి వేయబడును అని దేవుడే మోషేతో చెప్పుట నిర్గమ 32:32–33 నందు చదువగలము. కీర్తన 69:25–28 నందు దావీదు పరిశుద్ధాత్మ ద్వార ఇస్కారియోతు యూదా యొక్క పేరు మరియు అతని పోలిన ఇతరుల యొక్క పేర్లు జీవగ్రంథము నుండి తుడిపి వేయబడవలెనని ప్రార్థించుచున్నాడు (అపో॥ 1:20). ప్రకటన22:18–19 నందు క్రీస్తు తానే చెప్పు మాటలు గమనించగలము. అనగా దేవుని ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు జీవ గ్రంథమునుండి అతని పేరు తుడిచి వేయును.

## 3:7 ఫిలదెల్ఫియ సంఘము :

ఫిలదెల్ఫియ పట్టణము సార్డిస్‌నకు దక్షిణ ఈశాన్యమున 30 మైళ్ళ దూరమున కలదు.

3:9–10 నందు చెప్పబడిన ప్రవచనములు నెరవేరినవి.

3:11–12 నందు చెప్పబడిన ప్రవచనములు ఇక ముందు నెరవేరనైయున్నవి.

3:11 నందు నేను త్వరగా వచ్చుచున్నాడు అనుమాట రెండవ కారకకు చెందినది (1:7, 19:11)

3:12 జయించువానిని దేవుడు తన ఆలయములో ఒక స్తంభముగా చేయును (గలతి 2:9)

3:12 ప్రకారము జయించువానిపై నూతన యెరూషలేము అను దేవుని పట్టణపు పేరు వ్రాయబడును (21:2, 21:9–10)

3:10 నందు "భూనివాసులను శోధించుటకు లోకమంతటి మీదికి రాబోవు శోధనకాలము" అను మాటలు యోహాను దినములలో సంభవించనున్న శ్రమలను బట్టి వ్రాయబడినది. ఈ మాటలు ఇకమందు రానున్న 7 సంవత్సరముల శ్రమలకు చెందినవి కావు .

3:11 నందు నేను త్వరగా వచ్చుచున్నాను అని చదువుచున్నాము. ఈ మాటలు యేసు క్రీస్తు సంఘమును కొని పోవుటకు మధ్యాకాశమునకు దిగి వచ్చు రహస్య రాకడను తెలియచేయుచున్నది (1థెస్స 4:13–17, 2 థెస్స 2:7)

3:11 "నేను త్వరగా వచ్చుచున్నాను" అను మాటలను బట్టి సంఘమును కొనిపోవుటకు వచ్చుచున్న ప్రభువు యొక్క రాకడ మరియు ఆ తరువాత సంగ్రహముగా మనము విషయము తెలిసియుండుట అవసరము. సంఘమును కొనిపోవుటకు వచ్చుచున్న యేసుక్రీస్తు రెండవ రాకడ ఆ తరువాతి విషయములు (సంగ్రహముగా) యేసుక్రీస్తు యొక్క మరణు ద్వార మనము రక్షణ పొందుకొనుచున్నాము కనుక ఆయన మరణము మనకు రక్షణ నిశ్చయత కలుగ చేయుచున్నది (మత్తయి 26:28, రోమా5:6–11, 1పేతురు 2:24). కాని యేసుక్రీస్తు మరణించి పునరుత్థానము పొందియున్నందున మనమును కూడ పునరుత్థానము పొందుదుమని దేవుడు పునరుత్థానము యొక్క నిశ్చయత మనలో కలుగచేయుచున్నాడు (1థెస్స 4:14, 5:10, యోహాను 14:19, రోమా5:10, 6:5–8, 1కొరింథీ 15:4–23, 2తిమో 2:11). మనము మరణించునపుడు ఆ మరణము కేవలము ఒక నిద్రగా భావించాలి. ఇట్టి మరణము తరువాత క్రైస్తవుని ఆత్మ పరలోకమున ప్రవేశించును. మానవునిలో ఉన్న ఆత్మ ఒక నిజమైన వ్యక్తియైయున్నాడు. కనుక ఈ ఆత్మ తమ శరీరములు భూమిపై నిద్రించుచున్నందున అవి తమ పునరుత్థానము కొరకు నిరీక్షించుచుండును (2కొరింథీ 5:8, ఫిలిప్పీ 1:21–24, హెబ్రీ 12:22–23, హెబ్రీ 12:22–23, ప్రక 6:9–11). ప్రభువు పరమును విడిచి మధ్యాకాశమునకు దిగి వచ్చునపుడు (1థెస్స 4:1, పరమందున పరిశుద్ధుల ఆత్మలు కూడ తనతో కూడ దిగి వచ్చి, ఆ ఆత్మలు భూమిపై యున్న తమతమ శరీరములలోనికి ప్రవేశించి వాటితో ఏకమగును.

(9వ భాగం తదుపరి 'క్రైస్తవనాడు'లో)

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



బ్రదర్ వై కనకరాజు (హోలీ బైబ్లిసిస్ట్)

## నీవు నేను కాదు.. మనం!

**'యేసుక్రీస్తు అందరికి ప్రభువు'** మరియు **'సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము'** అన్న దేవుని వాక్యాలు 'క్రైస్తవనాడు' తొలిపేపరు ఆగష్టు 2006 నుంచి ప్రస్తుత పేపరు వరకు తొలిపేజీలో పైన, క్రింద మీకు కనబడతాయి. అవి ఇప్పటివరకే కాదుగాని ప్రభువు చిత్తమైతే.. కడవరకూ కనబడుతూనే ఉంటాయి. ఆ 'కడ' ఎప్పుడన్నది నేనెరుగ! అందుక్కారణం – **'కాలాలు సమయాలు తండ్రి తన స్వాధీనమందుంచుకొనియున్నాడు'** అన్న మరో దేవుని మాట నేనెరుగుదును కాబట్టి. ఆయన చిత్తమైనంతకాలం 'క్రైస్తవనాడు' సాగుతూనే ఉంటుంది. అందుకు 'దేవునికి స్తోత్రము'. నిరంతరం సాగేందుకు ప్రార్థనా సహకారాలందిస్తున్న మీ అందరికి నా వందనాలు.. మా కుటుంబం తరపున కూడాను.

తొలిపేజీలో పైనున్న మాటను ప్రతిదినం నాతోటి సేవకులందరం ప్రచురిస్తూనే.. ప్రకటిస్తూనే ఉన్నాం 'యేసుక్రీస్తు అందరికి ప్రభువని'. మంచిది. అందునుబట్టి 'దేవునికి స్తోత్రము'. మరి అదే పేజీలో క్రిందనున్న మాట దగ్గరే అనేకుల్లో విభేదాలు. ఇవి సమసేదెన్నడు? మనం ఐక్యత కలిగి నివసించేదెప్పుడు? దేవుని ఈ మాట కనీసం మన బ్రతుకుకాలంలోనైనా నెరవేర్చేందుకు ప్రయత్నిద్దాం.. ప్రయత్నిస్తే సహకరించే దేవున్నే మనం కలిగున్నాం. అందుకు దేవునికి స్తోత్రము.

ప్రస్తుత తరుణంలో టీవిల్లో ప్రసంగికుల దగ్గర్నుంచి తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లోనున్న వారందరూ 'కలసి' పనిచేసేందుకు సమాయత్తమవుతున్న విధానం ఎన్నదగింది.. ఆహ్వానించదగింది. దేవుని మాట నెరవేర్చి చూపేందుకు 'కలసి' ముందుకెళ్దాం. ప్రభువా నీమాట 'మా తరంలో' నిజం చేసేందుకు ప్రయత్నించాం. మీరు సహకరించారు. కాబట్టి మేమేకమయ్యామని ఆయనకు స్తోత్రం చెబుదాం. సహోదరులు ఐక్యత కలిగి నివసించుటన్నమాట నెరవేర్చి మన తర్వాతి తరాలకు మాదిరి ఉంచిపోయామన్న సాక్ష్యం బహు గొప్పది సుమా! అందువల్ల ఇకపైనైనా 'నీవు నేను కాదు.. మనం' అంటూ ముున్ముందుకు సాగుదాం! ఆ రోజులు మొదలయ్యాయని భావిస్తూ.. 'దేవునికి స్తోత్రము' చెబుతున్నా!

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి"

**గమనిక** **అనేకమంది చందాదారులు, ప్రకటన కర్తల సూచనపై 'క్రైస్తవనాడు' స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబరు ఇస్తున్నాం. ఇది 'క్రైస్తవనాడు' సబ్ - ఎడిటర్ మరియు డిజైనర్ బ్రదర్ వై.ధనరాజు కు సంబంధించినది. చందాదారులు, ప్రకటనకర్తలు తమ సౌకర్యాన్ని బట్టి ఈ క్రింది అకౌంట్‌లలో సొమ్ము జమచేయొచ్చని తెలియజేస్తున్నాం. - ఎడిటర్**

**CHRISTAVANAADU**
**Andhra Bank**
***Current A/C* : 13 96 111 00 00 00 52**
IFS Code : ANDB0001396
Adarsha Nagar Branch, Visakhapatnam

**Y.DHANA RAJU**
**State Bank of India**
**S/B A/c No.: 34513409917**
IFS Code : SBIN0010602
Vishalakshi Nagar, Visakhapatnam

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!**
చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 7981542666 / 9866113513 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగవోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★


'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

**ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.**

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న పరిశుద్ధ గ్రంథ వాక్యాన్ని బట్టి 'క్రైస్తవనాడు' స్వరచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

**'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకోండి.**

'క్రైస్తవనాడు' - ఆధ్యాత్మిక, రాజకీయ, సామాజికంగా సంచలనాత్మక వివరణలు, వార్తలు, విశ్లేషణలతో లక్షలాది క్రైస్తవులకు మరియు ఇతరులకు పరిచయమైన పేరు!




రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము. ★
వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును. ★
ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నది గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు. ★

'యథార్థ' రాతల్లో దమ్మున్న పేపరని పాఠకులిస్తున్న సాక్ష్యాన్ని బట్టి 'దేవునికి స్తోత్రం'.

## దేవుని జ్ఞానం – మానవ విజ్ఞానం

హోలీ బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట

బ్రదర్ వై.లీలా రవిరాజు



### తాను సృష్టించినవాటిలో మనము ప్రథమఫలముగా ఉండునట్లు సత్యవాక్యము (యేసుక్రీస్తు) వలన మనలను తన సంకల్ప ప్రకారము కనెను ★

ప్రకృతిలో ఉన్న సమస్త జీవకోటి పుట్టుక ఒకవంతైతే నరుని పుట్టుక మరో వంతు. సమస్త జీవులను భూమి పుట్టించినట్లు పరిశుద్ధ గ్రంథం సాక్ష్యమిస్తుంది.

**దేవుడు–వాటి వాటి జాతి ప్రకారము జీవముగలవాటిని, అనగా వాటి వాటి జాతి ప్రకారము పశువులను పురుగులను అడవి జంతువులను భూమి పుట్టించుగాకని పలికెను; ఆప్రకారమాయెను.** ★

దేవుని మాటలు ఎంతో ఉన్నతమైనవి, నిగూఢమైన సత్యాలు. పరిశుద్ధ గ్రంథాన్ని చదివి గ్రహించగలిగితే ఇటువంటివి అనేకములు మనకు దేవుడు బయలుపరుస్తారు. సమస్త జీవకోటి భూమి నుంచే పుట్టించారని ఎంత స్పష్టంగా తెలియజేస్తున్నారో చూసారా! మనుష్యులు చెప్పిన మాటల్లో అస్పష్టత కన్పిస్తుందేమో గాని దేవుని మాటల్లో(పరిశుద్ధ గ్రంథంలో) అస్పష్టత అన్నదే కానరాదు. పరిశుద్ధ గ్రంథంలో చెప్పిన ప్రతిమాట కూడా గ్రహించగల్గితే అది మన అభివృద్ధికి దోహదపడుతుంది. అది గ్రహించకపోతే తప్పుడు మార్గంలో పడిపోతుంటాం. ఇప్పుడు అనేకుల్లో జరుగుతున్నదిదే! దేవుని ఉద్దేశ్యాన్ని గ్రహించక ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు బోధించి ఎదుటివారి ప్రశ్నలకు జవాబులివ్వలేక సతమతమై పోతుంటారు. అందువల్ల మాత్రమే మన దేవుని నామము అన్యజనుల మధ్యన దూషించబడుతుందన్న ప్రభువు మాట నెరవేరుతుందని గ్రహించాలి. మన వలన దేవునికి మహిమ రావాలే గాని దూషణ రాకూడదు. శాస్త్రవేత్తలు గత కొద్దికాలం క్రిందట 'నేలనుండే మనుగడ' అనే విషయాన్ని గ్రహించారు. చాలా పత్రికల్లో ప్రచురించబడ్డాయి కూడా. వారు కనుగొన్నది క్రీస్తుశకంలో. అనగా క్రీస్తు భూమిపై జన్మించిన 2 వేల సంవత్సరాల తర్వాత. గాని మనకైతే పరిశుద్ధ గ్రంథంను బట్టి క్రీస్తుకు పూర్వమే మోషే ద్వారా దేవుడు వ్రాయించిన ఆదికాండంలో చెప్పబడింది. మనం అనేక సార్లు ఈ వాక్యాన్ని చదివే ఉంటాం. చాలా మంది గ్రహించకపోవచ్చు. దేవుడు స్పష్టంగా 'భూమి పుట్టించుగాకని' వ్రాయించారు. దేవుడంత స్పష్టంగా వ్రాయించినా గ్రహించలేనివారి వల్లే విభేదాలు తలెత్తుతాయి. దేవుడు వ్రాయించిన దానికి అనేక కథలు అల్లుకుంటూ వారిష్టమొచ్చినట్లు కొందరు ప్రకటిస్తుంటారు. దేవుడు భూమినుండి సమస్త జీవకోటిని పుట్టించినట్లుగానే దేవుడు మానవున్ని చెయ్యవచ్చుకదాని ఆలోచిస్తే..... నేలమట్టితో నరున్ని నిర్మించి ఆయన జీవవాయువుని ఊదగా అని వ్రాయబడింది. అంటే మన శరీరం వచ్చింది భూమినుంచే గాని ఆత్మ వచ్చింది దేవుని నుండి. ఇక్కడ ఒకసారి ఆలోచిస్తే..... దేవుడు ఆత్మలకు తండ్రి. భూమిమీద ఉన్న ప్రతి జీవికి ఆత్మ అనేది ఉన్నదని దేవుడు లేఖనాల్లో బయలుపరుస్తూనే ఉన్నారు.

**జీవాత్మగల సమస్త శరీరులలో రెండేసి రెండేసి ఓడలోనున్న నోవాహు నొద్ద ప్రవేశించెను.** ★

జీవం ప్రతి జీవికి ఉంది. మరి మనకున్న ప్రత్యేకతేంటి? దీనిక్కూడా బైబిలే సమాధానమిస్తుంది. ఎందుకంటే దేవుడు సమాధానానికి కర్త. మనం జీవాత్మ కలిగియున్న వారము. అది చెప్పిన దేవుడు నమ్మదగినవాడు. కాబట్టి మనము జీవాత్మ కలిగియున్నామని పరిశుద్ధ గ్రంథంలో చెప్పబడింది. అందువల్లే మనం ప్రత్యేకించబడినవారమని గ్రహించాలి. ప్రతి జీవిని భూమి చేసింది. మనలను మాత్రం దేవుడు తన పోలిక చొప్పున తన స్వరూపమున చేసి నాసికా రంధ్రములలో జీవాత్మ ఊదారని పరిశుద్ధ గ్రంథంలో మాత్రమే చూడగలం.

**ఏలయనగా దేవుడు తన స్వరూపమందు నరుని చేసెను** ★

మనలను ఎక్కడ ప్రత్యేకించారో చూసారా! ఆయన స్వరూపమందు నిర్మించబడ్డాముకాబట్టే ఆలోచించే శక్తి, శాసించే శక్తి, దేనినైనా సాధించే ఆలోచన మనిషికి మాత్రమే ఉంది. దాన్ని బట్టే మనుష్యుల్లో అభివృద్ధి. ఎందుకంటే దేవుడు నరునికి మాత్రమే **"మీరు ఫలించి అభివృద్ధి చెంది విస్తరించండి"** అని చెప్పినట్లు పరిశుద్ధ గ్రంథంలో చూస్తున్నాం. ఆ అభివృద్ధిలో లోపాల వల్లే నరజాతి అంతం మొదలైయింది. అభివృద్ధి దేవునిలో అయితే దేవుడు ఇంకా అభివృద్ధిచేస్తారు. గాని లోకంలో అభివృద్ధి చెందాలన్న యోచనతో దేవునికి అనేకులు దూరమైపోతున్నారు. దూరమైపోతున్నకొలది నరుడు నాశనానికి చేరువౌతున్నట్లే! దేవునికి విరుద్ధంగా చేసిన ఏ పనైనా నిలబడదు. అందుకే అనేకమైన ప్రకృతి వైపరిత్యాలు. దేవునిలో అభివృద్ధే మనకు మనవారికి శ్రేయస్కరమని మనం ఎరిగితే అదే మన అభివృద్ధికి తొలిమెట్టు. తదనుగుణంగా జీవిస్తూ క్రిందున్న దేవుని మాటను బట్టి ఆయన్ని స్తుతిద్దాం.

**ఆయన నిన్ను సృష్టించిన తండ్రికాడా? ఆయనే నిన్ను పుట్టించి స్థాపించెను.** ★

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ. ఫోన్ : 9866113513

**ఎందుకు?! :**

'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! హోలీ బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం హోలీ బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు హోలీ బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU,
13 - 237. Ambedkar Nagar, Old Police Station Center,
Nr. TIC Point, Arilova, Visakhapatnam - 530 040.
Andhra Pradesh State, INDIA.
Call : 9346960601, 9866113513

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Telangana State, INDIA. Call : 9346960601



9-10-1977 - 17-06-2018

# ప్రదీప్... నిన్నెలా మరువగలం?!

విశాఖపట్నంలో బాప్టిస్ట్‌లకు తల్లి సంఘం - రుద్రవీధిలోనున్న 'ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్'! సంఘానికి జాయింట్ ట్రెజరర్‌గా సేవలందిస్తూ పిన్నవయసులోనే పిలుపందుకొని లోకాన్ని వీడిన 'గుండుపల్లి ప్రదీప్' మమ్మల్ని ఇలా అనూహ్యంగా వీడి వెళ్తారనుకోలేదు. ఇంకా మాతోనే ఉండి సంఘ కార్యక్రమాల్లో ఉందన్న సాక్ష్యం పొందారు 'మన్నా క్యాటరింగ్' అధినేత బ్రదర్ ప్రదీప్!

సేవకులకు సహకారంగా.. అనాథ పిల్లలకు అన్నదాతగా పేరొందారు.. మూడోదినాన స్థానిక సంఘంలో జరిగిన కూటమిలో సాక్ష్యం పొందారు. సంఘ కార్యకలాపాల్లోనైతే అందరితోనూ కలుపుగోలుగా ఉంటూ సాగేవారు. అందుకే ఆయన లేరన్న నిజాన్ని సంఘపెద్దలతోబాటు సంఘమూ జీర్ణించుకోలేకుంది. దుఃఖ: కనబడనీయకుండేందుకు కూటమి జరిగిన నాడు వారు పడినపాట్లు ఆశ్చర్యం కలిగించకమానవు. ఊహించని విధంగా చిన్న వయసులోనే వారందర్నీ వీడిపోవడం వల్ల కలిగిన మనోవేధన అది! దాన్ని దాయడం ఎవరితరం?! ఇక ప్రదీప్ శ్రీమతి ప్రత్యూష, కుటుంబీకులైతే చెప్పనలవికాని శోక సంద్రాన ఉన్నారు. కదిలిస్తే ప్రవాహంగా కన్నీళ్లు పారకమానవని ఎరిగి సంఘం ముభావంగా ఉంది.. ఓదార్చింది.. ఆదరణకర్తయైన ప్రభు వాక్యాలతో ఊరడించింది.

సంఘ చైర్మన్ బిషప్ కె.సుందర్ సింగ్ మాట్లాడుతూ.. ప్రదీప్ కుటుంబాలకు భరోసాగా సంఘ చైర్మన్ బిషప్ కె.సుందర్‌సింగ్, ఆశోకాసింగ్ దంపతులు మేమున్నామన్నారు. సంఘపెద్దలూ అదేబాటలో ధైర్యాన్నిచ్చారా కుటుంబీకులకు.

కాపరి రెవ.డా.కె.డేవిడ్ విక్టర్ వాక్యమందించారు.. వాక్యంలో ఓదార్చారు.. విన్నవారికి హెచ్చరికగానుండి వారి భావి జీవితం సజావుగా సాగేందుకు మాటలు దోహదపడకమానవన్నట్లు ప్రసంగించారు.

బ్రదర్ ప్రదీప్ సేవలను ప్రత్యేకంగా గుర్తుచేసుకున్న సంఘ వైస్ చైర్మన్ - నాకెంతో సహకారంగా ఉండేవారు. నన్ను, సంప్రదించుటలో ముందుంటూ కార్యక్రమాలను కొనసాగించేవారు. మాబోటి పెద్దల యెడల ఎంతో వినయ విధేయతలు చూపే మా ప్రదీప్ ఇకలేరన్నది తలంపువస్తేనే బాధేస్తుందన్నారు.

స్త్రీల సమాజ అధ్యక్షురాలు దయామణి ప్రకాశ్ మాట్లాడుతూ - ప్రదీప్ పెద్దలైన స్త్రీలను తల్లుల్లా చూసేవారు, మిగిలినవారందరీ వారి వారి వయసునుబట్టి ఆప్యాయంగా పలుకరిస్తూ ఏదో ఓ వరుస కలుపుకుని కుటుంబీకునిలా ఉండేవారు. ఇలా వినాల్సి, చూడాల్సివస్తుందనుకోలేదన్నారు.

యూత్ ప్రెసిడెంట్ ఆర్.అనిల్ మా సంఘం జాయింట్ ట్రెజరర్ లేని లోటు లోటే! అందుక్కారణం - ఆయన అందర్నీ కలుపుకెళ్తూ కార్యక్రమాలు దిగ్విజయంగా జరగడానికి అహర్నిశలు కృషి చేసేవారు మా యూత్‌కి రోల్ మోడల్‌గా ఉండేవారు.

సండేస్కూల్ ప్రెసిడెంట్ శ్రీమతి ఉషారాణి ఆనంద మాట్లాడుతూ - విబిఎస్ ఘనంగా జరగడానికి, తదనంతరం పిల్లలకు ఆరోగ్యకరమైన, రుచి శుచి శుభ్రతలతో తన 'మన్నా క్యాటరింగ్' ద్వారా మంచి భోజన ఏర్పాట్లుగావించే వారు ప్రదీప్ అన్నారు. విబిఎస్ రిట్రీట్స్‌కు ఆయనందించిన సహకారం ఎనలేనిదన్నారు. బ్రదర్ ప్రదీప్ గురించి చెప్పాలంటే చాలా గుర్తుకొస్తున్నాయి. అటువంటి వ్యక్తులు సంఘాలకు సహకారులుగా పేరొందుతారన్న సాక్ష్యం అందరిలోనూ వినబడింది.

బిల్డింగ్ కన్వీనర్ బ్రదర్ శామ్ సుందర్ మాట్లాడుతూ.. మా ఇద్దరిమధ్య ఉన్న అనుబంధం ఎనలేనిదన్నారు. సంఘంలో ఏ కార్యక్రమమైన చేసేటప్పుడు ప్రదీప్ ప్రతి విషయంలోనూ నన్ను సంప్రదిస్తూనే ఉండేవారు. మేమంతా కలిసి ఓ టీం వర్కులా ప్రతీ కార్యక్రమాన్ని చేసేవాళ్ళం. అందువల్లే ఆ యా కార్యక్రమాలు ఎంతో దిగ్విజయంగా జరిగాయి. అటువంటి స్నేహితున్ని ఇంత చిన్నవయసులోనే కోల్పోవడం చాలా బాధాకరం.. లోటు కూడాను.


నజరీన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, విజయనగరం బాప్టిస్ట్ సంఘ కాపరి, అధ్యక్షులైన రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్ వాక్యమందించారు.

**- సంఘ చైర్మన్ బిషప్ కె.సుందర్ సింగ్, సెక్రటరీ : ఎస్. విజయబాబు, ట్రెజరర్ : పి.ఎస్.ఎబినెజర్, వైస్ చైర్మన్ : ఆర్.ఈశ్వరరావు జాయింట్ సెక్రటరీ : బి.వి.మనోహర్, డీకన్ బోర్డు సభ్యులు మరియు విశ్వాసులు, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్, రుద్రవారి వీధి, విశాఖపట్నం.**

## వాల్తేర్ సెమెట్రీలో బరియల్ చిత్రాలు..!








బ్రదర్ ప్రదీప్ గురించి చెబుతూ.. ఆయన విడిచివెళ్లిన కుటుంబానికి ఆదరణకరంగా సంఘముంటుందన్న భరోసానిస్తున్న బిషప్ కె.సుందర్‌సింగ్. ప్రక్కన సంఘ కాపరి రెవ.డా.డేవిడ్ విక్టర్






సెక్రటరీ ఎస్.విజయబాబు




ఆంధ్ర బాప్టిస్ట్ సంఘ చైర్మన్ బిషప్ కె.సుందర్ సింగ్ తదితర పెద్దలతో సెమెట్రీలో బ్రదర్ ప్రదీప్‌ను గురించి చెబుతున్న రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్

భూస్థాపిత కార్యక్రమం నిర్వర్తిస్తున్న.. సంఘ కాపరి డి.జాన్





భర్త పార్థివ దేహం దగ్గర వేదనగా.. ప్రత్యూష మరియు కుటుంబీకులు

## సంఘంలో జ్ఞాపకార్థ కూటమి చిత్రాలు..!



వేదికపై ముఖ్యప్రసంగానికి విచ్చేసిన రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్, బిషప్ కె.సుందర్‌సింగ్ సంఘ కాపరి రెవ.డా.డేవిడ్ విక్టర్



వైస్ చైర్మన్ ఆర్.ఈశ్వరరావు, ట్రెజరర్ : పి.ఎస్.ఎబినెజర్, జాయింట్ సెక్రటరీ : బి.వి.మనోహర్, సెక్రటరీ : ఎస్.విజయబాబు





సంఘ చైర్మన్ బిషప్ కె.సుందర్ సింగ్, అశోకా సింగ్ దంపతులు

గుండుపల్లి ప్రదీప్ విడిచివెళ్లిన కుటుంబీకుల ఆదరణ కోసం ప్రార్థిస్తున్న సంఘ కాపరి రెవ.డా.డేవిడ్ విక్టర్



**GOOD NEWS**

**For those who wants to study MBBS (MD) in Abroad**

Course : 6 Years

University tuition fees : ₹ 18 Lakhs
(can be paid on installments)

Consultancy Service charge ₹ 50,000 only

Admission Letters, Visa, Medical, Embassy, Ministry of external affairs, Documentation works and Flight ticket : ₹ 1,00,000

Please contact for immediate Admission and more details :
M.Joshua & Danielson
+91 9866 060 731, 7680866877

**New Hope Educational Consultancy**
Address : Deepthisree Nagar, Madinaguda, Hyderabad.

**ప్రశ్నలు**

1) సూదిబెజ్జము అనగానేమి? "నూతన నిబంధన"
2) కోరేషు తల్లిదండ్రులెవరు? "పాత నిబంధన"

మీ జవాబులకు గడువు : జూలై 3 వరకు పెంచడమైంది.



**ఖచ్చితమైన జవాబులకు బహుమతి 500/- రూ.లు 'క్రైస్తవనాడు' ద్వారా చెల్లింపబడును**

ప్రశ్నోత్తరుడు : **డా.జాన్ దేవదాస్**, హైద్రాబాద్

**జవాబులు ఎక్కువమంది చెబితే చీట్లువేసి వారిలో ఇద్దరిని ఎన్నికచేసి, ఆ వివరాలు జూలై మొదటి 'క్రైస్తవనాడు'లో ప్రచురిస్తాం.. బహుమతులు పంపిస్తాం! దేవుని వాక్యం యెడల అనేకులకు ఆసక్తి కలిగించి పురిగొల్పాలన్న డా.జాన్ దేవదాస్‌గారి ఆలోచనబట్టి రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమ కొనసాగింపుపై మీ అభిప్రాయాలనూ ఆహ్వానిస్తున్నాం - బ్రదర్ వై.కనకరాజు (హోలీ బైబ్లిసిస్ట్).**

# గ్రేటర్ విశాఖ పాస్టర్స్ ఫెలోషిప్ కూడిక


రెవ.శాంసన్ ఆధ్వర్యంలో రెవ.మాదె విజయ కుమార్ అధ్యక్షులుగానున్న 'గ్రేటర్ విశాఖ పాస్టర్స్ ఫెలోషిప్ రిజిష్టర్డ్ నెం.683/2005' కూడిక జరిగింది. రుద్రవారి వీధిలోనున్న బాప్టిస్టుల తల్లి సంఘమైన ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ అందుకు వేదికైంది. సేవకులు తమకున్న అనుభవాలను పంచుకుని ఒకర్నొకరు బలపర్చుకున్న ఈ కూటమిలో స్థానిక సంఘ కాపరి రెవ.డేవిడ్ విక్టర్ వాక్యమందించారు. సంఘ చైర్మన్ బిషప్ కె.సుందర్ సింగ్‌ను పాస్టర్లు సముచితరీతిన సత్కరించారు. అందుకు కృతజ్ఞతలు చెబుతూ 'క్రైస్తవనాడు' పేపరు ఎడిటర్ బ్రదర్ వై.కనకరాజు, సబ్ ఎడిటర్ బ్రదర్ వై.ధనరాజులకు కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయాన బిషప్ కె.సుందర్‌సింగ్ స్పందిస్తూ 'క్రైస్తవనాడు' కనకరాజు మా సంఘ సభ్యులేనని అందర్నీ ఆశ్చర్యపరచారు. ఆ విధంగా బిషప్ కె.సుందర్ సింగ్ స్పందించడం వారి పెద్ద మనసుకు నిదర్శనమన్నారు ఎడిటర్. 88 ఏండ్ల వయస్సులోను ఆయన యువకునివలే చేస్తున్న కార్యక్రమాల్ని దగ్గరగా చూసాను. అటువంటి అనుభజ్ఞుల, పెద్దల మాటలో దీవెనగా భావిస్తానన్నారు. అటువంటి మన్ననలను పొందడం పరిచర్యలో నాకెంతో ప్రోత్సాహాన్నిస్తుందనీ అన్నారు బ్రదర్ వైకెయార్.




ఫెలోషిప్‌లో ప్రసంగిస్తున్న రెవ.డా.డేవిడ్ విక్టర్ మరియు పాల్గొన్న ఫెలోషిప్ పెద్దలు



సన్మానించబడుతున్న ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ చైర్మన్ బిషప్ కె.సుందర్‌సింగ్


రెవ.శాంసన్, రెవ.డానియేల్ గాంధి మరియు రెవ.డా.వై.ప్రభుదాస్



పుష్పగుచ్ఛం అందుకుంటున్న ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ వైస్ చైర్మన్ రెవ.ఆర్.ఈశ్వరరావు



పుష్పగుచ్ఛం అందుకుంటున్న ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ ట్రెజరర్ పి.ఎస్.ఎబినెజర్

తమ సంఘం ఎల్లప్పుడు సేవకులకు సహకారిగానే ఉంటుందన్నారు బిషప్ కె.సుందర్‌సింగ్. ఫెలోషిప్ వారందర్నీ ఆయన అభినందిస్తూ తనవంతు సహాయసహకారాలందిస్తానన్నారు. అంతేగాక ఇటువంటి మరెన్నో కార్యక్రమాలకు ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ అన్నివిధాలా సహకరిస్తుందన్నారు. ఫెలోషిప్‌వారు మాట్లాడుతూ

ఫెలోషిప్ వారు సమాజహితవుకై మరిన్ని కార్యక్రమాలు చేయాలని సంకల్పించారు. అందుకోసం అందరి సహకారాన్ని కోరారు. వారు మరిన్ని కార్యాలు చేసేందుకు పాల్గొన్న అందరూ సహకరిస్తానన్నారు. అనంతరం అందరికీ భోజన ఏర్పాట్లను ఆంధ్రాబాప్టిస్ట్ సంఘం వారు ఏర్పాటు చేసారు. ఇది వారికి ఆనవాయితీగా మారిందన్న సాక్ష్యం ఎంతైనా అభినందించదగిందని ఫెలోషిప్ పెద్దలు అన్నారు.

### సంగారెడ్డి జిల్లా, తెలంగాణ సదాశివపేటలో

# మతాతీతంగా ఈద్-మిలాప్!




జమాతే – ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణ ఆస్రా కాంప్లెక్స్‌లో 'ఈద్ మిలాప్'ను మతాతీతంగా జరిపారు స్థానిక ముస్లిం నాయకులు. గత కొన్నేండ్లగా వారు జరుపుతున్న ఈ కార్యక్రమం అందర్నీ కలుపుకుపోతోంది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కుల మత సంబంధం లేకుండా అందర్నీ ఆహ్వానించి జరుపుతున్న ఈ కార్యక్రమం ఆహ్వానించదగిందన్నారు. ఇటువంటివి రాష్ట్రమంతటా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముస్లిం పెద్దలను, హైందవ, క్రైస్తవ పెద్దల్ని అభినందించారు. ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందన్న భరోసానిచ్చారు.

ఈ కార్యక్రమంలో ముస్లింల తరపున మత గురువు మౌలానా అబ్దుల్ రహమాన్, జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు రఫిక్ ఉల్ రెహమ్మాన్, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హంజద్ హుస్సేన్ తదితరులు హాజరయ్యారు. హైందవుల తరపున శ్రీరామ కళామందిరం పూజారి పాండు రంగారావు, క్రైస్తవుల తరపున స్థానిక 'జీసస్ క్రైస్ట్ బ్రదర్స్ ఎన్ సిస్టర్స్ మిషన్' వ్యవస్థాపకులు పాస్టర్ ఎ.ప్రేమ్ కుమార్ హాజరయ్యారు. నిన్నువలే నీ పొరుగువారిని ప్రేమించన్న యేసు చెప్పిన మాటను ఉద్ఘాటించారు పాస్టర్ ప్రేమ్ కుమార్. భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగుందని అందుకు నిదర్శనాలే ఇలాంటి కార్యక్రమాలన్నారు. ఇటువంటి కార్యక్రమాల సంఖ్య మరింత పెరగాల్సిన అవసరముందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. అందు చైర్ పర్సన్ పట్నం విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట చంద్రశేఖర్, రాష్ట్ర బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పట్నం సుభాష్, జమాతే – ఇస్లామి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సాదిక్‌హైమద్, కార్యదర్శులు ముగ్దుం అలీ, షరీవుద్దీన్, జహిరుద్దిన్, బ్యాంక్ అధ్యక్షుడు అశ్వక్ తదితరులున్నారు.



TV ద్వారా వాక్యపరిచర్య
**వాక్యాన్వేషణ**
ప్రపంచమంత ఉన్న క్రైస్తవులను ఆదరించుచున్న ఏకైక TV ప్రోగ్రామ్

ప్రసంగరత్న, దైవదాసులు
రైట్. రెవ. డా॥ పోల్సపల్లి శామ్‌కుమార్ గారు
దైవదీవెన ఆడియో, వాక్యానేషణ, వీడియో వర్తమానికులు.

ప్రతి రోజు

| | | | |
|---|---|---|---|
| ఆదివారం | ఉ॥ | 7.00 గం॥లకు | ప్రార్థన TV లో (VSP) |
| ఆదివారం | రా॥ | 7.00 గం॥లకు | ప్రేమసాక్షి TV లో |
| సోమవారం | రా॥ | 7.30 గం॥లకు | గాస్పల్ TV లో |
| మంగళవారం | ఉ॥ | 7.00 గం॥లకు | హెవెన్ TV లో |
| బుధవారం | ఉ॥ | 9.00 గం॥లకు | శుభవార్త TV లో |
| గురువారం | మ॥ | 12.00 గం॥లకు | ఆరాధన TV లో |
| శుక్రవారం | ఉ॥ | 9.00 గం॥లకు | ప్రార్థన TV లో (VZD) |
| శనివారం | ఉ॥ | 9.00 గం॥లకు | బర్‌జోనా TV లో |

వీక్షించండి... దైవ జ్ఞానం పొందండి

SAM KUMAR INTERNATIONAL MISSION
9666444222 www.aptu.org.in

**డా.జాయ్ చెరియన్ (ఫౌండర్ : యు.పి.ఎఫ్. హైద్రాబాద్) రచించిన 'హృదయపరీక్ష' పుస్తకంలోని ఆర్టికల్స్‌ను పాఠకులకు అందించాము. ఇప్పట్నుంచి వారు వ్రాసిన '1000 దేవుని వాగ్ధానములు' పుస్తకంలోని ఆర్టికల్స్‌ను అందిస్తున్నాం. చదవండి.. మీ స్పందనలూ తెలపండి. విశ్వాసులు బలపడేందుకు ఈ ఆర్టికల్స్ తోడ్పడగలవని భావిస్తున్నాం. డా. జాయ్‌చెరియన్ గారు 'క్రైస్తవనాడు'కు అందిస్తున్న ప్రార్థనా సహకారములను బట్టి ఈ సందర్భానా వారికి మా కృతజ్ఞతలు తెలుపుతున్నాం**

**- బ్రదర్ వైకెయార్ కుటుంబం, తెలుగు రాష్ట్రాలు.**

# 3. అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును

– యోబు 22:28

**"అయితే నా నామమందు భయభక్తులుగలవారగు మీకు నీతి సూర్యుడు ఉదయించును; అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును గనుక మీద బయలుదేరి క్రొవ్విన దూడలు గంతులు వేయునట్లు గంతులు వేయుదురు."** – మలాకీ 4:2

ఆరోగ్యము అనేది మహా భాగ్యమంటారు. అన్నీ ఉండి ఆరోగ్యం లేకపోతే లాభలేమి లేదు. నీవు ఏదీ అనుభవించలేవు. ఫ్రిజ్ నిండా నోరూరించేటట్లు పండ్లు ఉంటాయి. కాని తినే భాగ్యముండదు. ఎందుకంటే షుగర్ వ్యాధి. మటన్, చికెన్, బిరియాని తినాలని ఆశ. డాక్టర్ వద్దని వారిస్తాడు. ఎందుకంటే హైబి.పి. గుండెదడవలన చెమటలు, కళ్లు తిరిగి పడతానేమో అనే భయము. కానీ విశ్వాసులమయిన మనకు ఒక గొప్ప వాగ్దానం – "అతని రెక్కలు ఆరోగ్యము కలుగజేయును." హల్లెలూయ! మనకు ఆరోగ్యం సరిగ్గా లేకుంటే స్పెషలిస్ట్‌ల దగ్గరకు వెళతాము. కాని పక్షిరాజు, దాని ఒంట్లో నలతగా అనిపించినప్పుడు జబ్బు చేసినప్పుడు అది పర్వత శిఖరముమీదికి వెళ్ళి రెక్కలు చాపి నేరుగా సూర్యుని చూస్తుంది. నేరుగా సూర్యున్ని తేరిచూస్తూ శక్తి పొందుతుంది. ఆ సూర్యరశ్మి కిరణాలు దానిపై పడి దాని శరీరములోని క్రిములు, బాక్టీరియా దహించబడతాయి. దాని రెక్కలు చాపి, శక్తితో నింపబడి వెళ్లిపోతుంది.

విశ్వాసివైన నీవు ఆరోగ్యం బాగాలేనప్పుడు నేరుగా నీతి సూర్యుడైన ప్రభువును సమీపిస్తున్నావా? ఆయన సన్నిధిలో కొద్ది సమయము గడుపుతున్నావా? లేక నేరుగా డాక్టర్స్ దగ్గరకు పరుగెడుతున్నావా? నీ రోగము ఏదైనా, క్యాన్సర్, బి.పి., షుగర్, కీళ్ళ వాపు, ఏదైనా సకలవ్యాధులకొరకు ప్రభువు సిలువలో బలి అయ్యాడు. ఆయన పొందిన దెబ్బలచేత స్వస్థత – ఆయన కార్చిన రక్తముచే విడుదల. హల్లెలూయ! నీవు మూల్గనవసరము లేదు. నీతి సూర్యునియొద్దకు రా. ఆయన రెక్కలు నీకు ఆరోగ్యం కలుగజేస్తాయి. నీవు క్రొవ్విన దూడవలే గంతులు వేస్తావు. అయితే ఒక షరతు ఆయన నామమందు నీవు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించాలి. పాపము చేసేవారికి వచ్చే మొదటి శిక్ష ఆరోగ్యము కోల్పోవడము. పాపులు రోగులుగా మారిపోవడం ఖచ్చితం.

సాక్ష్యం : ఒకరోజు మందిరానికి 19 సం॥ల వయస్సుగల బాబుని ముగ్గురు మనుష్యులు కలిసి మోసుకొచ్చారు. ఆ బాబుకి కాళ్లలో సత్తువలేదు. కాళ్లు భూమిమీద ఆనించడానికి శక్తిలేదు. తెచ్చి ఒక కుప్పలాగా పడేసారు. హాస్పిటల్‌లో ఎవరో నర్సులు చెబితే తెచ్చారట. ఆ బాబుని చూడగానే పరిశుద్ధాత్ముడు నాకు ఆత్మలో సమస్తము బయల్పరచాడు. ఆ బాబు జీవితం సరిగా లేదని, జీవితములో పాపానికి బానిసగా మారిపోయాడని. వెంటనే అధికారముతో చెప్పాను బాబూ! నీవు చేసిన తప్పులన్నీ దేవుని సన్నిధిలో ఒప్పుకొని విడిచిపెట్టు. పశ్చాత్తాపముతో వేడుకుంటే ప్రభువు నిన్ను క్షమించి స్వస్థపరుస్తాడని చెప్పాను. ఆ బాబు ఇది వినగానే షాక్ అయిపోయాడు. వెంటనే కన్నీళ్లతో తన తప్పులన్నీ ఒప్పుకున్నాడు. అమ్మా, ఇదంతా నీకెవరు చెప్పారు? నేనిప్పుడే కదా మీ దగ్గరకు వచ్చాను అన్నాడు. సమస్తము చూస్తున్న దేవుడు, గ్రహించే దేవుడు ఆ అబ్బాయికి అద్భుతమైన స్వస్థత నిచ్చాడు. మందిరములో నిలువబడి సాక్ష్యమిచ్చాడు.

"నా కుమారుడా, నా మాటలను ఆలకింపుము నా వాక్యములకు నీ చెవి యొగ్గుము. నీ కన్నుల యెదుటనుండి వాటిని తొలగిపోనియ్యకుము. నీ హృదయమందు వాటిని భద్రముచేసికొనుము. దొరికినవారికి అవి జీవమును వారి సర్వశరీరమునకు ఆరోగ్యమును ఇచ్చును." – సామెతలు 4:20–22

దేవుని మాటలు ఎంతగా వింటే సర్వశరీరమునకు అంతగా ఆరోగ్యం నీ ఎముకలకు సత్తువ ఉంటుంది.

"నేను జ్ఞానిని గదా అని నీవనుకోవద్దు. యెహోవాయందు భయభక్తులుగలిగి చెడుతనము విడిచిపెట్టుము. అప్పుడు నీ దేహమునకు ఆరోగ్యమును నీ యెముకలకు సత్తువయు కలుగును." – సామెతలు 3:7,8

చెడుతనము వదలిపెట్టాలి. ఇతరులమీద కొండెములు చెప్పడము మానివేయాలి. గొణగడము సణగడము మానాలి. పాపము నీయొద్ద ఉంటే దానిని వదులుకోవాలి. పరిశుద్ధ మందిరమునకు రావాలి. ఆయన నామస్మరణతో ఆయనను కొనియాడాలి. వాగ్దానాలు ఎత్తిపట్టి ప్రార్థించాలి. నీ ముఖము ఆయన తట్టు ఎత్తుకోవాలి. నీవు క్రుంగిపోక దేవుని వాగ్దానముతో సాతానును ఎదిరించాలి.

# 4. నీవు పైవాడవుగా ఉందువుగాని క్రింది వాడవుగా ఉండవు

– ద్వితీ.కాం.28:14

ద్వితీ.కాం.28వ అధ్యాయములో 1 నుండి 14 వచనములు దేవుని మాట వినేవారు పొందే వాగ్దానములు. 15 నుండి 68 వచనములు ఆయన మాట విననొల్లని వారికి దేవుడు విధించే శాపములను గూర్చి పరిశుద్ధ గ్రంథములో మనము చూడగలము.



**డా.జాయ్ చెరియన్**
యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్
రాం నగర్, (హైద్రాబాద్)

నీవు పైవాడుగా ఉండాలంటే షరతు మొదటి వచనములోనే ఉంది.

**"నీవు నీ దేవుడైన యెహోవా మాట శ్రద్ధగా విని నేడు నేను నీకు ఆజ్ఞాపించుచున్న ఆయన ఆజ్ఞలన్నిటిని అనుసరించి నడుచుకొనినయెడల నీ దేవుడైన యెహోవా భూమిమీదనున్న సమస్త జనములకంటె నిన్ను హెచ్చించును."** – ద్వితీ.కాం.28:1

జీవితములో పైకి రావాలని ప్రతి ఒక్కరికీ ఆశ. కొంతమంది ఎంత ప్రయత్నించినా మేము పైకి రాలేకపోతున్నాము. మా బంధువులు మేము పైకి రాకుండ అడ్డు పడుతున్నారంటారు. ఉద్యోగంలో ప్రమోషన్ రావడం లేదు అని అంటారు. అట్టివారితో నేను ఒక దేవుని సేవకురాలిగా ఖండితముగా చెపుతున్నాను. అటువంటి పిచ్చి ఆలోచనలు కొట్టిపారేయండి. దేవుడు ఒక వ్యక్తిని పైకి తేవాలనుకుంటే ఎవరెన్ని కుయుక్తులు పన్నినా అవి చెల్లవు. ఆయన ప్రాకారములు పడగొట్టువాడు. ఇత్తడి తలుపులను ఇనుప గడియలను విడగొట్టువాడు.

**"నీకు విరోధముగా రూపింపబడిన యే ఆయుధమును వర్థిల్లదు."** – యెషయా 54:17

**"నేను కార్యము చేయగా త్రిప్పివేయువాడెవడు?"** – యెషయా 43:13

ఆయన తెరచిన ద్వారము మూయడానికి ఎవరి తరము? నీవు చేయవలసినదల్లా ఆయన మాట వినడం. ఆయనయందు భయభక్తులు కలిగి ఆయన మాటలు ఆజ్ఞలు కట్టడలు అనుసరించి నడుచుకో. ఆయన వాగ్దానాలు ఎత్తి ప్రార్థించు. అప్పుడు నీవు పైవాడవుగా ఉంటావు. ఏ శక్తి నీకు ఆటంకముగా నిలువనేరదు. ఆయనలో నీవుంటే నీలో ఆయన మాటలుంటే నీవు చేసే ప్రతి పని ఆయన సఫలపరుస్తాడు.


కొంతమంది ఒక్క అడుగు ముందుకు వేస్తే పది అడుగులు వెనక్కి వేస్తారు. ఆలాగుండక ఆయనలో స్థిరులుగా ఉండాలి. అన్నదమ్ములు యోసేపును గోతిలో త్రోసివేసారు. కాని, దేవుడు యోసేపును విడిచి పెట్టలేదు. ఆయనకిచ్చిన దర్శనమును వాగ్దానమును నెరవేర్చాడు. కొద్ది కాలము శ్రమపడ్డాడు. కాని, ఐగుప్తు సింహాసనమును పొందాడు. తృణీకరించిన అన్నదమ్ములు యోసేపు పాదాలమీదపడి సాష్టాంగ నమస్కారము చేసారు. దేవుడు – యోసేపును ఇచ్చువాడిగా చేసాడు. పైవాడిగా నుంచాడు. తన సోదరులకు కరవు కాలములో సంచులు సంచులుగా ధాన్యమును రూకలును ఇచ్చాడు.

**"మరియు ఫరో – చూడుము, ఐగుప్తు దేశమంతటి మీద నిన్ను నియమించి యున్నానని యోసేపుతో చెప్పెను. మరియు ఫరో తన చేతినున్న తన ఉంగరము తీసి యోసేపు చేతిని పెట్టి, సన్నపు నారబట్టలు అతనికి తొడిగించి, అతని మెడకు బంగారు గొలుసు వేసి తన రెండవ రథముమీద అతని నెక్కించెను."** – ఆదికాం.41:41,42

దేవుని మాట విని ఆయన వాగ్దానాలు హత్తుకొని బ్రదికితే నీవు కూడా పైవాడవుగా ఉంటావు. యోసేపును హెచ్చించిన దేవుడు నిన్ను కూడా హెచ్చించి పైవాడిగా ఉంచుతాడు. తృణీకరింపబడిన రాయిని మూలకు తలరాయిగా చేస్తాడు.

**"అది యెహోవావలన కలిగినది అది మన కన్నులకు ఆశ్చర్యము".** – కీర్తనలు 118:23

# ప్రభువు మాటే వేదం!! అదే ఆంద్రేయ విశ్వాసం



**రెవ.టి.ఎ.ప్రభుకిరణ్**
హైద్రాబాద్

ఒకవైపు దేవుణ్ణి విశ్వసిస్తూనే మరోవైపు మన సమస్యలకు సొంత పరిష్కారాలు వెదుక్కోవడం నిజంగా అవివేకం. కొత్తగా కొనుక్కున్న కారును, దర్జాగా నడిపిస్తూ వెళ్ళకుండా చెమటలు కక్కుతూ రోడ్డుమీద నెట్టుకుపోవడం లాంటిదే ఇది!

ఒకసారి వేలాది మంది ప్రజలు ఆకలి దప్పులుకూడా మర్చిపోయి యేసుప్రభువు ప్రబోధాలు వింటున్నారు. వారికందరికీ మీరే ఆహారం పెట్టండంటూ ప్రభువు తన శిష్యులకు చెప్పాడు. సపర్యలు చేయించుకోవడానికి, పెడితే సుష్టుగా భోంచేయడానికి మాత్రమే అలవాటుపడ్డ ఆయన శిష్యులకు ఈ సూచన రుచించలేదు. ఈ మహారణ్యంలో అన్ని వేలమందికి ఆహారం ఎక్కడ దొరుకుతుందన్నారు కొందరు. పంపించేస్తే ఇళ్లకు వెళ్ళివాళ్ళ భోజనం వాళ్ళు చూసుకుంటారన్నారు మరి కొందరు. ఇక ఫిలిప్పు అనే శిష్యుడైతే అప్పటికప్పుడు లెక్కలు వేసి అన్ని వేలమందికి తలా ఒక రొట్టెనివ్వాలన్నా రెండొందల దీనారాల బడ్జెట్ కావాలన్నాడు. సంకుచిత్వం, స్వార్థం, నిరాశావాదం మిళితమైన 'అసాధ్యశాస్త్ర పాండిత్యం' ఆయన శిష్యులదని ఆరోజు తేలిపోయింది. కాని వారిలో ఆంద్రేయ అనే శిష్యునిది మాత్రం పూర్తిగా విభిన్నతత్వం. అది ప్రభువు పురమాయించిన పని గనుక ఎలాగైనా ఆపని చేయాలన్నది అతని తపన. వేలాదిమందికి కాకపోయినా తనవంతుగా కనీసం ఒకరిద్దరికైనా అన్నం పెట్టలేనా? అని ఆలోచించాడు. బడ్జెట్‌లు, కమిటీలు సాధ్యాసాధ్యాల చర్చల జోలికిపోకుండా ఆంద్రేయ జనంలోకి వెళ్ళాడు. ఒక బాలుని దగ్గర ఐదు రొట్టెలు, రెండు చేపలు ఉంటే వాటిని తెచ్చి ప్రభువు చేతిలో పెట్టాడు. ప్రభుపు వాటినే ఆశీర్వదించి శిష్యులకిచ్చి పంచమంటే వాటితో ఐదువేల మందికి పైగా తృప్తిగా భోంచేయగా పన్నెండు గంపలనిండా ముక్కలు మిగిలాయి (యోహాను 6 13) యేసుప్రభువు వారి కృపా సామ్రాజ్యంలో సమృద్ధికి, మిగులుకే తప్ప సంకుచితత్వానికి, లోటుకు తావులేదు. మన వద్ద ఉంటే అది ఒకరిద్దరికి మాత్రమే సరిపడే ఆహారం. కాని దాన్ని వదులు కోవడానికి సిద్ధపడి ప్రభువు చేతిలో పెడితే అదే వేలాది మంది ఆకలిని తీర్చే ధాన్యాగారం!! ఇది విశ్వాసికి మాత్రమే బోధపడే పారమార్థిక రహస్యం. సమస్తశక్తికి, సృజనాత్మకతకు ప్రాప్తిస్థానమైన ప్రభువుతో ఆయన సహగమనంతో మనంచేసే నిరంతర సాంగత్యంలో, ఆయన దైవత్వం మన విశ్వాసం కలిసి అదొక 'అజేయమైన శక్తి' గా రూపుదిద్దుకొంటుంది. (రోమా 8 37)

లోక కళ్యాణాన్ని కాంక్షించే వాళ్లంతా మహాత్ములు, మదర్ థెరిస్సాలు కానక్కర్లేదు. తనవంతు కర్తవ్యాన్ని విశ్వాసంతో ప్రతి ఒక్కరూ నిర్వర్తిస్తే, అది ఒక ఉద్యమ రూపం దాల్చితే సాతాను పన్నాగాలు తప్పక నిర్వీర్యమవుతాయి. మనం ఒకవంతు చేస్తే ప్రభువు తనదిగా తొంబైతొమ్మిది వంతులు దానికి చేర్చుతాడు. చరిత్రలో, బైబిలులో జరిగిన అద్భుతాలన్నీ అలాగే జరిగాయి. అదే విశ్వాస సూత్రం కూడా.

ఆకాశమంతా నా ఒక్కడికే కావాలని అడిగితే అది అత్యాశే అవుతుంది. కాని అది ఈ ప్రపంచంలోని ఆరొందల కోట్ల మంది సొత్తు గనుక, దాన్ని ఆరొందల కోట్లతో విభాగించి 'నా వంతుగా వచ్చే ముక్కను నాకివ్వు' అని ప్రార్థించడం సహేతుకమే కాక అది మన హక్కు కూడా. కోటానుకోట్ల నక్షత్ర మండలాలను తన గర్భంలో ఇట్టే ఇముచ్చుకో గలిగినంత సువిశాలమైన గగనంలో, అలా మన వంతుగా వచ్చే భాగం కూడా మన ఊహలకంద నంత విశాలంగా ఉంటుందని వేరుగా చెప్పనక్కర్లేదు కదా! కాకపోతే అందుకు అనంతమైన విశ్వాసం కావాలి. పరిమితులను అధిగమించి ఆలోచించగల లోతైన అపారంగా పారమార్థిక జ్ఞానం కావాలి.




# వివాదాలు – ప్రశ్నలు లేవనెత్తి.. ముగిసిన సేవకుల – క్రైస్తవుల 'సమైక్య' మహోత్సవము!




డా.పి.సతీష్ కుమార్ దర్శనంతో ఏర్పడ్డ **'బాడీ ఆఫ్ క్రైస్ట్' (బిఓసి)** ఆధ్వర్యములో విశాఖ వేదికగా 'గొప్ప సేవకుల' అద్భుతమైన కలయిక, చారిత్రాత్మక 'వేడుక'ంటూ ఈనెల 12వ, తేదీన ఉదయం పాస్టర్లతో కూడిక, సాయంత్రం క్రైస్తవులు పాల్గొన్న మహోత్సవం జరిగాయి. దీనికి 'ముఖ్య ప్రసంగీకులు' కూడా ఆయనే! మిగతా విషయాలు తెలిపేందుకు తెలుగు రాష్ట్రాల్లో విశ్వాసులకు టివిల్లో కనబడే సేవకులు హాజరయ్యారు.

విశాఖలో వివాదాస్పదంగా ముగిసిన ఈ కార్యక్రమం జరగబోతోందని తెలిసిన రోజునుంచే సోషల్ మీడియాలో అలజడి రేగింది. మీటింగుకు సంబంధించిన హ్యాండ్‌బిల్ రిలీజ్ అయినప్పట్నుంచే అందు ప్రచురించబడిన సేవకుల చిత్రాల్లో తమ ఫోటో లేదని అందువల్ల మమ్మల్ని గుర్తించలేదన్న భావన కొందరిలో నెలకొంది. అందులో ప్రచురించబడిన ఫోటోలోనున్న వారే గొప్ప సేవకులా? తెలుగు రాష్ట్రాల్లో ఇంకెవరూ లేరా? అన్న చర్చలు ఇరు రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాల్లో జరిగినట్లు వింటున్నాం. ఆ తర్వాత ఆ హ్యాండ్‌బిల్ (కరపత్రం)లో ప్రచురించబడిన వారి ఫోటోల్లో కాస్త మార్పులు, చేర్పులు చేసారు.. చల్లబర్చేందుకు నిర్వాహకులు ప్రయత్నించారు.

డా.పి.సతీష్ కుమార్ దర్శనం – 'బాడీ ఆఫ్ క్రైస్ట్' అని, తద్వారా క్రైస్తవసమాజానికి మేలు జరిగేట్లు మా ప్రణాళికలుంటాయని వేదికపైనున్న వారు చెప్పుకొచ్చారు. బాడీ ఆఫ్ క్రైస్ట్ తరపున ఏర్పాటు చేసిన తొలి సభ విశాఖ లో జరపడం యాదృచ్ఛికమైనా అది **బిఓసి** కి దీవెనగా మారగలదు. అదెలా అన్నది తర్వాతి పేపర్లో చదువగలం. ఈ సమైక్య వేదిక ఎవరి ఆలోచనైనా.. అది ఆహ్వానించదగిందేనన్నది విశ్వాసుల మాట.

ఎన్నో అవాంతరాలను అధిగమించి సజావుగా కార్యక్రమాన్ని నిర్వహించడంలో బిషప్ కె.ఆర్.సింగ్ సమయస్ఫూర్తి, పబ్లిసిటీ నుంచి ప్రాంగణ ఏర్పాట్లు తదితర విషయాలను ఆద్యంతం చూసుకున్న బ్రదర్ శామ్యూల్ కర్మోజి ఆలోచన, ప్రణాళిక, అందుకు తగ్గట్లు వారు కష్టపడిన విధానం, ఆయనకు పూర్తి సహాయ సహకారాలందించిన 'మిరకిల్ చర్చ్' విశ్వాసులు చూపిన సహనం ఎన్నదగిందన్న సాక్ష్యం పొందారు. ఎన్ని నిష్ఠూరాలు పడినా బ్రదర్ శామ్యూల్ కర్మోజి, వారి సంఘస్తులు ముందుకే వెళ్లారు.



సేవకుల్లోనున్న గందరగోళ పరిస్థితులపై వివరణ ఇచ్చేందుకు 'క్రైస్ట్ చర్చ్' (విశాఖ)లో ఏర్పాటుచేసిన సేవకుల సదస్సులో పాస్టర్లు ప్రశ్నలను లేవనెత్తారు. సభలపై తమకున్న అనుమానాలు వెలిబుచ్చారు. బిషప్ తండ్రి అని పిలుస్తూ నిలబెట్టి ప్రశ్నించారు డా.కె.ఆర్.సింగ్ తదితరుల్ని. వారి పిలుపునుబట్టి తండ్రివలే ప్రేమించి తగురీతిన సమాధానాలిచ్చి వారిని శాంతింపజేసారు బిషప్ కె.ఆర్.సింగ్. నాడు ఆతిథ్యమిచ్చిన బిషప్ ఎం.ఎ.పాల్ ఈ సభలకు అందరూ సహకరించాలి.. విశాఖకు ఎట్టిపరిస్థితుల్లోను చెడ్డపేరు రాకూడదు అని వేడుకున్నారు. వేరే ప్రోగ్రాంలో ఉండడంవల్ల తాను హాజరుకాలేకపోతున్నందుకు మన్నించాలన్నారు. అలాగే బ్రదర్ శామ్యూల్ కర్మోజి ఎవరితోనూ కలవరని, అందువల్ల నిర్వాహణ ఆయనెలా చేస్తారన్న ప్రశ్నను లేవనెత్తారు సేవకులు.

సేవకుల సందేహాలను తన ఏర్పాట్లతో పటాపంచలుగావించారు బ్రదర్ సామ్యూల్ కర్మోజి మరియు వారి మిరకిల్ సంఘస్తులు. ఇది ఆయన కాబట్టే ఏర్పాట్లు అంత బాగున్నాయి మరింకెవరైనా కష్టమయ్యేదన్న సాక్ష్యాన్నీ పొందారు మిరకిల్ సంఘస్తులు.. వారి నాయకులు బ్రదర్ శామ్యూల్ కర్మోజి. అవును, అందుకు తగ్గ 'టీము' వారికుంది.. ఆ టీము కృషి ఫలితమే నాడు విశ్వాసులు చూసారక్కడ.

ఏదేమైనా బ్రదర్ పి.సతీష్ కుమార్ ఉదయం సాయంకాలాల్లోనూ వేదికపై ఆద్యంతం వినయ విధేయతలు కనబరుస్తూ కూర్చున్న విధానం ఎంతైనా అభినందించదగింది. ఆ మనసు ఆయనకొచ్చి.. అనేకులకు మాదిరి చూపింది. వేదికపైనున్న సేవకులు ఎలా ఉండాలన్న దానికో నిదర్శనం డా.పి.సతీష్ కుమార్ కూర్చున విధానం. దేన్నీ గమనించుకోరన్న విధానాన్ని వీడి, అన్నీ గమనించే స్థితిలో నేటితరంవారున్నారన్న విషయాన్ని సేవకులు, నాయకులు గుర్తిస్తే సమాజానికో సందేశం వెళుతుంది. తద్వారా నేటి పరిస్థితుల్లో మనకు మేలు తప్పక జరుగుతుందన్నది పాల్గొన్న విశ్వాసుల చర్చల సారాంశం.

సేవకులకు, విశ్వాసులకు అందుబాటులోనే ఉందరన్న డా.పి.సతీష్‌కుమార్ ఈ కార్యక్రమంతో దాన్ని పటాపంచలు గావించారు. మొత్తానికి ఆయనో ప్రత్యేక ఉద్దేశంతో అందర్నీ కలుపుకెళ్తున్నారు. అందుకు తగ్గ ప్రణాళిక, ప్రయాసా వారిదే! మనం కేవలం సహకరిస్తే పోయేదేముంటుంది? ఈ విధంగానైనా ఆయన అందరికి అందుబాటులో కొచ్చారుగా!! అందర్నీ మరిముఖ్యంగా ఒకరంటే ఒకరికి పడదన్న సాక్ష్యం కలిగిన టివి ప్రసంగీకుల్ని ఏకం చేస్తున్నారుగా! వారు మునుపు ఒకరిపై ఒకరు ప్రసంగాలతో యుద్ధాలు చేసుకున్నవారేగదా? ఇప్పుడిలా ఏకంగా అందరూ 'కలిసిరావడం' క్రైస్తవ సమాజానికి మేలు చేయదంటారా? ఆలోచించండన్న వారు విశాఖలోనే కాదు ఇరు రాష్ట్రాల్లోను అన్నిచోట్లా ఉన్నారు. 'అందరు కలసి' ముందుకెళ్తామంటున్నప్పుడు.. సంతోషిద్దాం.. ప్రార్థిద్దాం.. వీలైనంత సహకరిద్దాం.. సహకారం పొందుదాం.. అందర్లోనూ ఏకీభావం కలుగజేస్తున్న దేవునికి స్తోత్రము చెబుదాం అంటున్న పెద్దల హితవు వినుట శ్రేయస్కరం.

## డా.పి.సతీష్ కుమార్‌కు రాజకీయ ఎజెండాలేదు : బిషప్ కె.ఆర్.సింగ్

విశాఖలో మహోత్సవాల వెనుక కల్వరి టెంపుల్ (హైద్రాబాద్) అధినేత డా.పి.సతీష్‌కుమార్‌కు ఎటువంటి లోపాయికారీ రాజకీయ ఎజెండా లేదన్నారు వేదిక నుంచి బిషప్ కె.ఆర్.సింగ్ (విశాఖ). డా.పి.సతీష్ కుమార్ కేవలం క్రైస్తవ సమాజానికి మేలు చేయాలని, అందుకు తనవంతు సహాయసహకారాలందించేందుకే ప్రయత్నిస్తున్నారని చెప్పారు బిషప్ కె.ఆర్.సింగ్. అందువల్ల ఎవరెటువంటి అనుమానాలు పెట్టుకోవద్దన్నారు. డా.పి.సతీష్‌కుమార్. ఎమ్మెల్యే లేక ఎమ్మెల్సీ అయ్యేందుకు ప్రయత్నించడం లేదని ఖరాఖండిగా చెప్పారు బిషప్ కె.ఆర్.సింగ్.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అయి ప్రభుత్వపరంగా మనకు రావాల్సిన వాటిని పోందేందుకు పోరాడే వ్యక్తులు క్రైస్తవ సమాజంలో ప్రతి జిల్లాలోనూ ఉన్నారు. అందుకు తగ్గ వ్యక్తుల్ని గుర్తించి వారిని బలపర్చి సహకరిస్తే చాలన్నది అనేకుల అభిప్రాయం. తద్వారా మనకు మేలు జరక్కమానదు. కాబట్టి సమాజాన్ని దోచే నాయకులెవరు.. సమాజ హితవు కోరి సేవా భారంతో తమ ఖర్చులతో ముందుకెళ్తున్న నాయకులెవరు అన్నది తెలుసుకోవాలి. అది ప్రస్తుత తరుణంలో క్రైస్తవుల్లో గొప్పవారిగా పేరుగాంచిన వారిముందున్న కర్తవ్యం అంటున్నారు సంఘాల్లోనున్న పెద్దలు, పాస్టర్లు.. విశ్వాసులు.

● ఈ మహోత్సవములో దొర్లిన పొరపాట్లు ఏంటి? ● రానున్న రోజుల్లో ఇతర జిల్లాల్లోను జరిగే సభల్లో 'బోధకులు' పాటించాల్సిందేంటి? ● తమ ప్రసంగాల్లో.. చెప్పాల్సినవి, చేతల్లో చూపాల్సినవి.. హావభావ విన్యాసాలెలా ఉండా? ● ప్రసంగాల్లో దొర్లకూడని అంశాలేంటి? ● విశాఖలో ఏ సేవకులెలా మాట్లాడారు? అందెన్ని వాక్యానుసారం? మరెన్ని సాతాను మాటలు? అన్నదానిపై బ్రదర్ వైకెయార్ 'వాక్యానుసార' విశ్లేషణ జూలై మొదటి (1-15) 'క్రైస్తవనాడు' పేపర్లో చదవండి.. నిజానిజాలు.. సత్యాసత్యాలు ఎరగండి.. స్పందించండి.

**సోషల్ మీడియాలో కుల గోలెందుకు?!** ఈ మీటింగుకి సంబంధించి పెట్టిన ఓ పోస్ట్‌లో డా.పి.సతీష్ కుమార్ 'నాయుడు' అని కుల ప్రస్తావన తెచ్చారని తెలిసింది. ఆయన 'కాపు' కులానికి చెందినవారు కాబట్టి అలా సంబోధించారేమో! రేపు నాదీ 'కాపు' కులమేనని తెలిసి నన్నాలా సంబోధించే ప్రబుద్ధులు బయల్దేరొచ్చు! ఇది క్రైస్తవులకు తగదని, కుల ప్రస్తావన చేస్తే ఆ కులాన్ని క్రీస్తుకి అంటగట్టేస్తున్నారని 'క్రైస్తవనాడు' గతంలోనే వ్రాసింది - బ్రదర్ వైకెయార్.



Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 13 - 237, Ambedkar Nagar, Old Police Station Center, Nr.TIC Point, Arilova, Visakhapatnam - 530 040, Andhra Pradesh State, INDIA. Ph : 9346960601,9866113513. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, Ambedkar Nagar, Arilova, Visakhapatnam - 40.